బీఆర్ఎస్ నాయకుడికి మాజీ మంత్రి పరామర్శ

కొండారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

పెద్దమందడి, మే 8 : మండలంలోని జంగమాయిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొండారెడ్డి ఇటీవల బైక్ యాక్సిడెంట్‌లో కోలుకొని విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం గ్రామానికి వెళ్లి కొండారెడ్డిని పరామర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొని త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు గ్రామ బీఆర్ఎస్ నాయకులు నందిపేట శ్రీను, నాగేంద్రం, సైదులు, కార్తీక్, రాజు, రాములు, యాదయ్య, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ సర్కార్ విఫలం

- బీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతు నాయుడు

గద్వాల, మే 8 : రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు బాసు హన్మంతు నాయుడు ఆరోపించారు. గురువారం ధరూర్ మండలం అల్లపాడ్ గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో డంపింగ్ చేసిన ధాన్యాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ముందుగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కల్పించిన సౌకర్యాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు ఉందన్నారు. ఆరుగాలం రైతులు పంట పండించి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే అక్కడ సరైన సమయంలో కొనే నాథుడు లేకరైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో కూర్చొని అందాల పోటీలపై సమీక్షలు చేస్తున్నాడని, రైతన్నల సమస్యలు పట్టించుకోవడడం లేదని విమర్శించారు. అప్పు పుట్టడం లేదని మాట్లాడడం అంటే సీఎంగా ఫెయిల్ అయ్యారని అర్థమవుతున్నదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వం గన్నీ బ్యాగులు ఇచ్చే పరిస్థితిలో లేదన్నారు. ముఖ్యమంత్రి చిల్లర మాటలు తగ్గించి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలు నిర్వహించి రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన కాలంలో కరోనా వచ్చినా, నోట్ల రద్దు జరిగినా ఏ రోజూ రైతులకు రైతు బంధు ఆపలేదన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి తరుగు పేరుతో క్వింటాకు రెండున్నర కేజీలు కట్ చేస్తున్నారని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చక్రధర్‌రావు, శేఖర్‌నాయుడు, వెంకటేశ్వరరెడ్డి, నూర్‌పాషా, కృష్ణారెడ్డి, నర్సింహులు, ఆంజనేయులు, కామేశ్, రాముడు, శ్రీను వాసులు, తిమ్మప్ప పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న హనుమంతు నాయుడు

అభాగ్యులకు అండగా..



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్,మే 8 : నియోజకవర్గంలోని ఎర్రవల్లి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన పద్మమ్మ అనారోగ్యానికి గురి కాగా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నది. ప్రభుత్వం నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5లక్షల ఎల్‌వోసీ మంజూరు కాగా అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాన్ని నిర్మించడం సంతోషదాయకం

- మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి



ఆలయం వద్ద మాజీ ఎంపీ రావుల, బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి టౌన్, మే 8 : జిల్లా కేంద్రంలోని పాతబజార్‌లో ఇటీవల రోడ్ల విస్తరణలో భాగంగా కాళికామాత ఆలయాన్ని నూతనంగా నిర్మించడం సంతోషదాయకమని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని దక్షిణ కాళికాంబిక కమటీశ్వర స్వామికి నిత్య పూజల కోసం వాడే శతగోపం, తీర్థం గిన్నె, గంట మొదలగు వెండి పూజ సామగ్రిని నిర్వాహకులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రావుల మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత, ఆత్మ సంతృప్తి కలుగుతుందని భవిష్యత్తులో ఆలయానికి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కృషితో ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటీ శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేశ్ గౌడ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, ఉంగ్లం తిరుమల్, సూర్యవంశం గిరి, సునీల్, ఎం.డీ గౌస్, చిట్యాల రాము, నగేశ్, పరశురాం, బాలరాజు, సూగురు రాము, పోతులపల్లి వెంకటేశ్, రామస్వామి, ఖాదర్ ఉన్నారు.

సమాజంలో మార్పుకోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలి

- అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్

గద్వాల, మే 8: సమాజంలో మార్పు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. కలెక్టరేట్ ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు సర్‌జీవన్ హెన్రీడ్యూ నాంట్ జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మే 8న అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ స్థాపకుడు హెన్రీడ్యూనాంట్ జయంతి సందర్భంగా ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం నిర్వహించుకుంటామన్నారు. మానవతా సేవలకు అతను చేసిన అపూర్వ కృషికి గుర్తుగా, మొట్టమొదటి నోబెల్‌శాంతి బహుమతి ఆయనకు లభించిందన్నారు. రెడ్ క్రాస్ సంస్థ విశ్వవ్యాప్తంగా మానవతా ఉద్యమానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. విపత్తుల సమయంలో సహాయ సహకారాలు, రక్తదానం, ఆరోగ్యసంరక్షణ, విపత్తు సంసిద్ధత తదితర రంగాల్లో ఈ సంస్థ చేపడుతున్న సేవలు గొప్పవని చెప్పారు. భవిష్యత్‌లో సేవలు మరింత విస్తరించేలా కార్యక్రమాలు చేపట్టాలని సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు రమేశ్, అయ్యపురెడ్డి, వరద రవికుమార్, అక్బర్ పాషా, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

గోపాల్‌పేట, మే 8 : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రజిని ఆదేశాలమేరకు గురువారం మండలంలోని ఏదుట్ల గ్రామంలో భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రఘు మాట్లాడుతూ.. భూ భారతి చట్టం, ఫైలట్ ప్రాజెక్టు కింద గోపాల్‌పేట మండలాన్ని ఎంచుకొని ప్రారంభించిటన్లు తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు విచారణ చేసే ముందు 30 రోజుల్లో విచారణ పూర్తి చేసి పాస్ పుస్తకం ఇష్యూ చేస్తారన్నారు. 30రోజుల్లో విచారణ పూర్తి చేయకపోతే ఆటోమెటిక్‌గా మ్యుటేషన్ పూర్తి అవుతుందన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే రెండంచెల అపిల్ వ్యవస్థను ఈ చట్టం ప్రకారం ఆర్డీవోకి, కలెక్టర్‌కు అధికారాలు ఇచ్చారన్నారు. ఈ చట్టం ప్రకారం వ్యవసాయ భూ ములతో పాటు ఇంటి స్థలాల హక్కుల రికార్డు సరిచేసి ఇస్తారన్నారు. రైతులు ఉచిత న్యాయ సాయం కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ఉచిత న్యాయ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ పాండు, ఆర్ఐ యాదయ్య, రెవెన్యూ సిబ్బంది శేషయ్య, శ్రీదేవి, మదన మ్మ, కమిత, రమేశ్, దివ్య భారతి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలి

అమరచింత, మే 8: ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం రోజుకు రూ.600 కూలి చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండలంలోని పాంచెడ్డిపల్లి గ్రామ శివారులో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్ చట్టాలను రద్దు చేయాలని ఈనెల 20 తేదీన దేశ వ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో ఉపాధి కూలీలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఆ యన వెంట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శంకర్ ఉన్నారు.

మంజూరైన ఇండ్లు త్వరగా గ్రౌండింగ్ అవ్వాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, మే 8 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మొదటి విడుతలో మంజూరైన ఇళ్లు త్వరగా గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఎంపీడీవోలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం , ఉపాధి హామీ పథకం, వానకాలంలో అంటురోగాలు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లపై మాట్లాడుతూ మొదటివిడుతలో ప్రతి మండలం నుంచి ఒక్కో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని 1,300మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారన్నారు. అందులో ఇప్పటి వరకు గ్రౌండింగ్ చేసిన వివరాలు, మరికొన్ని పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను ఒక్కో మండలం వారీగా సమీక్ష నిర్వహించారు. ఎవరైతే ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభించుకోలేదో వారితో రాతపూర్వకంగా ఇష్టం లేదని రాయించుకోవాలని సూచించారు. వారి స్థానంలో ఇతర పేదలకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. రెండో విడుతలో భాగంగా ఇందిరమ్మ కమిటీల నివేదిక ఆధారంగా లక్ష్యం మేరకు ప్రత్యేక అధికారులు స్కూట్నీ చేసిన జాబితాను కలెక్టర్ లాగిన్‌కు త్వరగా పంపించాలని ఆదేశించారు. రాజీవ్ యువవికాసం పథకంపై మాట్లాడుతూ ఆయా సంక్షేమ శాఖల ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా స్కూట్నీ చేసి జాబితాను బ్యాంకులకు అందజేయాలని, ఈ ప్రక్రియ మే 15లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ కూలీలకు 15లక్షల పనిదినాలు కల్పించేందుకు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు కేవలం 2.60లక్షల పనిదినాలు మాత్రమే కల్పించామని ఇప్పుడు రోజుకు 40వేల పనిదినాలు కల్పిస్తే తప్పా లక్ష్యాన్ని చేరుకోలేమని సూచించారు. వచ్చే హరిత వనోత్సవంలో ప్రతి గ్రామానికి వచ్చిపోయే దారిలో 6 అడుగుల ఎత్తుగల అందమైన మొక్కలు నాటాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధుల కట్టడిపై మాట్లాడుతూ వానకాలంలో దోమల వల్ల డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులను ప్రతి నెలా 1, 11, 21 తేదీల్లో శుభ్రం చేసేలా చూసుకోవాలని తెలిపారు. బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ మిషన్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్‌చార్జి యాదయ్య, డీఆర్‌డీవో ఉమాదేవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివ కుమార్, మండల ప్రత్యేకాధికారులు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు , ఎంపీవోలు పాల్గొన్నారు.

ఉత్తమ బోధన అందించేలా చర్యలు తీసుకోవాలి

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో పదో తరగతి ఫలితాలపై సమీక్ష నిర్వహించారు. విద్యాపరంగా పేరుగాంచిన వనపర్తి జిల్లా పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో 29వ స్థానం పొందడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని కలెక్టర్ మండిపడ్డారు. ఉత్తీర్ణతలో వెనుకబడిన ఉపాధ్యాయులను పిలిపించి శిక్షణ కార్యక్రమం చేపట్టాల్సిందిగా విద్యాధికారిని ఆదేశించారు. అదేవిధంగా ప్రస్తుతం 9వ తరగతిలో గణితం లో వెనుకబడి ఉన్న విద్యార్థుల జాబితాను సేకరించి జూన్ 12 నుంచి నెల రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. వచ్చే 10వ తరగతి వార్షిక పరీక్షలో ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ కావడానికి వీలు లేదని ఉపాధ్యాయులు బాధ్యత తీసుకొని విద్యార్థులకు తగిన రీతిలో బోధించాలని ఆదేశించారు. విద్యార్థులు ఫెయిల్ అయితే సంబంధిత ఉపాధ్యాయుడు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈవో అబ్దుల్ ఘని, ఏసీజీ గణేశ్, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

దరఖాస్తుల ఆహ్వానం

లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. అభ్యర్థులు ఇంటర్‌మీడియట్ (గణితశాస్త్రం) ఒక అంశంగా ఉండి కనీసం అరవై శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఐటీఐ నుంచి డ్రాట్స్ మన్ (సివిల్) , డిప్లొమా సివిల్, బీటెక్ సివిల్ లేదా ఇతర సమానమైన విద్యార్హత కలిగి ఉండాలని, శిక్షణ ఫీజు ఓసీ అభ్యర్థులకు రూ.10వేలు, బీసీ అభ్యర్థులకు రూ.5వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రంలో మొత్తం 50 పనిదినాల్లో తెలంగాణ అకాడమీ ల్యాండ్ ఇన్సర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. వివరాలకు 9849081489, 9441 947339 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

గద్వాల అర్బన్, మే 8 : రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ అశోక్ కథనం మేరకు...జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన ఎరుకలి శ్రీను(22) ఆరునెలల నుంచి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. అనారోగ్యంతో ఎక్కువ రోజులు బతకడని వైద్యులు తెలపడంతో శ్రీను తన తల్లిదండ్రులకు భారం కాకూడదని ఉద్దేశంతో గురువారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కుటుంబ సభ్యుల మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కిందపడి యువకుడు..

ఎర్రవల్లి చౌరస్తా, మే 8 : ప్రమాదవశాత్తు కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు ఇటిక్యాల మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన నారాయణ(30) బుధవారం ఎర్రవల్లికి దేవరకు వచ్చాడు. అతను కొంత కాలంగా తాగుడుకు బానిసగా మారి ఎలాంటి పనులు చేయకుండా తిరిగేవాడు. బుధవారం రాత్రి దేవరలో మద్యం తాగిన మైకంలో ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. మృతుడు నారాయణకు భార్య కొడుకు ఉన్నారు. అన్న రామయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..

వడ్డేపల్లి, మే 8 : మండలంలోని కొంకల గ్రామానికి చెందిన కృష్ణమనాయుడు గద్వాల మండలం మెల్లచెర్వు గ్రామ సమీపంలోని రైల్వేట్రాక్ పక్కన గురువారం తెల్లవారుజామున అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. మెల్లచెర్వులో జరిగిన దేవరకు వచ్చి రైల్వే ట్రాక్ పక్కన మృతి చెందడంపై పలు అనుమానాలకు తావిస్తోందని గ్రామస్తులు అంటున్నారు. మృతుడికి భార్యాపిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ ..

మల్దకల్, మే 8 : మండలంలోని శేషంపల్లి గ్రామ సమీపంలోని నెట్టంపాడు గ్రామం వద్ద బుధవారం రాత్రి వాహనం ఢీకొన్న ఘటనలో నర్సింహులు అనే వ్యక్తి గాయాలు కావడంతో కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు చికిత్సకు తరలించారు. చికిత్సపొందుతూ గురువారం ఆయన మృతి చెందినట్లు ఎస్సై నందికర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం బింగిదొడ్డి గ్రామానికి చెందిన ఉప్పరి నర్సింహులు (45) మండలంలోని అమరవాయి గ్రామంలో దేవరకు బంధువుల ఇంటికి విందుకు వచ్చాడన్నారు. తిరుగు ప్రయాణంలో బైక్‌పై వెళ్తున్న క్రమంలో అయిజ నుంచి వస్తున్న వాహనం ఢీకొట్టడంతో నర్సింహులకు త్రీవ గాయాలు కాగా వెంటనే గద్వాల దవాఖానకు చికిత్స కుతరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు వాహన డ్రైవర్ శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎర్రవల్లి చౌరస్తా, మే 8 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన గురువారం ఇటిక్యాల మండలం పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు ఎర్రవల్లి ఎస్ఎంఆర్ వద్ద ఎర్రవల్లి నుంచి గద్వాలకు వెళ్తున్న టాటాఎస్ ఆటో వేగంగా వెళ్తున్న క్రమంలో సడెన్‌గా బైక్ అడ్డురావడంతో తప్పించబోయి ఎదురుగా ఉన్న కల్వర్టును ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను గద్వాల దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూల్ దవాఖానకు తరలించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదు.

రైతులు ఆర్థికంగా ఎదగాలి

- ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నర్సింగరావు

గట్టు, మే 8 : రైతులు, రైతుకూలీలు ఆర్థికంగా ఎదగాలని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నర్సింగరావు ఆకాంక్షించారు. మండలంలోని ఆరగిద్ద శివారులో ఉపాధిహామీ పనులను ఆయన గురువారం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధిహామీ పనులను మొక్కుబడిగా కాకుండా నిర్ణీత కొలతల్లో చేస్తే ఆశించిన స్థాయిలో కూలి డబ్బులు అందుతాయని స్పష్టంచేశారు. మూస పంటలకు స్వస్తి చెప్పి తోటల పెంపకంపై దృష్టి పెట్టాలన్నారు. తద్వారా పెట్టుబడితోపాటు కాయకష్టం తగ్గి రైతులు లాభాల బాటలో పయనిస్తారని చెప్పారు. అనంతరం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీల సంఖ్యను మరింత పెంచాలని కోరారు. కూలిడబ్బులు నిర్ణీత సమయంలో వారికి అందేవిధంగా చూడాలన్నారు. ఉపాధిహామీ సిబ్బంది పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆరగిద్దలో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని అదనపు కలెక్టర్ హౌసింగ్ పీడీ కాశీనాథ్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చెన్నయ్య, ఏపీవో స్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆరగిద్ద శివారులో మహిళా కూలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

జేఎన్‌టీయూ కళాశాల వార్షికోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు

లక్ష్యసాధనకు కృషి చేయాలి

వనపర్తి టౌన్, మే 8 : విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకొని లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలని జేఎన్‌టీయూ హైదరాబాద్ ప్రొఫెసర్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ బాలునాయక్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీఎస్ రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ద్వితీయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రయోగశాలను ఏర్పరుచుకోవడం, గ్రంథాలయంలో 2వేల పుస్తకాలను సమకూర్చుకోవడం జరిగిందన్నారు. అలాగే ఉద్యోగ అవకాశాల కల్పనకు తమవంతు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకొని వనపర్తి ఇంజినీరింగ్ కళాశాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తేవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా బెంగుళూర్‌లో జరిగిన జాతీయస్థాయి లాంగ్‌జంప్ పోటీలలో కళాశాల విద్యార్థి పాల్గొని బంగారు పతకం సాధించిన సందర్భంగా జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామ్ నరేశ్‌యాదవ్ , ఏఎస్‌వో డాక్టర్ ఆశాజ్యోతి, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

గద్వాల రూరల్, మే 8 : రైతులు పంట మార్పిడి పద్ధతులు ఉపయోగించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని పాలెం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నళిని అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలోని రైతు వేదికలో గురువారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం శాస్త్రవేత్తలు పాల్గొని రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ శాతం యూరియా , అవసరం మేరకు రసాయనాలు వాడటం వల్ల సాగు ఖర్చు తగ్గించుకోవచ్చునని తెలిపారు. అనంతరం డీఏవో సక్రియా నాయక్ మాట్లాడుతూ పంటల సాగులో నూతన సాంకేతికతను పాటించి అధిక దిగుబడులు పొందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ సీడ్స్ ఆదినారాయణ రెడ్డి, ఆయిల్‌ఫాం ఫెడరేషన్ అధికారి శశిధర్ గౌడ్, ఏవో ప్రతాప్ కుమార్, ఏఈవో అనూష, రైతులు పాల్గొన్నారు.

కొండపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో పాల్గొన్న డీఏవో సక్రియా నాయక్

మాట్లాడుతున్న బాల నర్సింహ

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

- సీపీఐ రాష్ట్ర నాయకుడు బాలనర్సింహ

అమరచింత, మే 8 : రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీల అమలుపై దృష్టి పెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాలనర్సింహ సూచించారు. గురువారం ఆత్మకూర్ మండల కేంద్రంలోని వర్తక సంఘం భవనంలో నిర్వహించిన సీపీఐ వనపర్తి జిల్లా సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టి ఐదు వందల రోజులు గడుస్తున్నా ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా సీఎం మాటలతో కాలయాపన చేయకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి సారించాలని లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఉగ్రవాదుల స్థావరాలపై భారత ఆర్మీ జరిపిన దాడిని సీపీఐ స్వాగతిస్తుందని, అలాగే ఇరుదేశాల ప్రజల ప్రాణాలకు ఎలాంటి హానీ జరగకుండా యుద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమానికి సీపీ ఐ జిల్లా సమితి సభ్యులు మోష అధ్యక్షత వహించగా సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, మండల కార్యదర్శి రాబర్ట్, నాయకులు చంద్రయ్య